క్లుప్తంగా

లోహాకు విద్యుత్ పునరుద్ధరణ



కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దహెగాం: మండలంలోని మారుమూల గిరిజన గ్రామం లోహా మూడు రోజులుగా అంధకారంలో ఉండడంతో ఆదివారం సాక్షిలో 'అంధకారంలో లోహా' అనే కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. ట్రాన్స్‌కో ఏఈ రవీందర్ స్పందించి గ్రామంలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ లోహాలో కరెంటు లేదన్న విషయం తమకు తెలియగానే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గ్రామానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

చేతిపంపు ప్రారంభం



చేతిపంపు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ఆసిఫాబాద్‌రూరల్: పోచ్చమ్మ ఆలయానికి వచ్చే భక్తుల కోసం చేతిపంపు ఏర్పాటు చేసినట్లు జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని బూర్గుడ గ్రామంలో పోచ్చమ్మ ఆలయం వద్ద నూతన చేతిపంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుల అవసరానికి చేతిపంపు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు ప్రసాద్, పెంటు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి'

కాగజ్‌నగర్‌రూరల్: జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ప్రత్యేక కార్యాలయాన్ని కేటాయించాలని ఎక్స్ ఆర్మీ సర్వీస్‌మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ నాయర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని శిశు మందిర్ పాఠశాలలో నిర్వహించిన ఎక్స్‌ఆర్మీ సర్వీస్‌మెన్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్‌కు జూలైలోగా స్థలాన్ని కేటాయిస్తామని ఎమ్మెల్యే హరీశ్ బాబు హామీ ఇచ్చారని, స్వాతంత్య్ర దినోత్సవం రోజు తమ స్థలంలోనే జాతీయ జెండాను ఎగురవేస్తామన్నారు. త్వరలోనే జిల్లాలో ఎన్‌సీసీ కోచింగ్‌సెంటర్ కూడా ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎక్స్‌సర్వీస్‌మెన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ మృతి



రాజేశం (ఫైల్)

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ జంజిరాల రాజేశం(హైటెక్ రాజు)(53) ఆదివారం ఉదయం మృతి చెందాడు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం డ్రైవర్‌గా పని చేస్తున్న రాజేశం గత కొంతకాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మెకానిక్ విధులు నిర్వహిస్తున్న రాజేశం ఇంటి నుంచి ఆదివారం ఉదయం డ్యూటీకి బయలుదేరాడు. డిపోకు రాకపోవడంతో తోటి కార్మికుడు ఇంటికి ఫోన్ చేయగా కుటుంబ సభ్యులు డిపోకు వెళ్లే మార్గంలో చూడగా బజార్‌వాడీలోని డ్రెయినేజీలో పడి ఉన్నాడు. వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య రేవతి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, బీసీ సంఘం నాయకులు రూప్‌నర్ రమేశ్‌తో పాటు సంఘ నాయకులు ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీశ్ తెలిపారు.

'కాంగ్రెస్‌తోనే కార్యకర్తలకు న్యాయం'



దేవయ్యను సన్మానిస్తున్న చర్చి సభ్యులు

కౌటాల: కాంగ్రెస్‌తోనే ప్రతీ కార్యకర్తకు తగిన న్యాయం జరుగుతుందని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన సిద్దల దేవయ్య అన్నారు. ఆదివారం మండలంలోని శివలింగపూర్ గ్రామంలోని ఇమ్మానుయేలు చర్చిలో నూతన చైర్మన్‌గా ఎన్నికైన దేవయ్యను చర్చి సభ్యులు సన్మానించారు. దేవయ్య మాట్లాడుతూ గత పదేళ్లుగా పార్టీ బలోపేతం కోసం పని చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ సువార్త రాజన్న, శ్రీనివాస్, శంకర్, జానీ, జనార్ధన్, కిరణ్ పాల్గొన్నారు.

జోరుగా 'ఉపాధి' పనులు

- పనులకు ఆసక్తి చూపుతున్న కూలీలు
- 15 రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో నగదు జమ
- లక్షా 18వేల పని దినాలు కల్పించిన అధికారులు
- రూ. 2కోట్ల 61లక్షలు కూలీలకు చెల్లింపు



కాలువలో పూడిక తొలగిస్తున్న కూలీలు

పెంచికల్‌పేట్: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు జోరుగా సాగుతున్నాయి. వర్షాలు లేక ఖరీఫ్ పనులు నెమ్మదిగా సాగుతున్న నేపథ్యంలో కూలీలు ఉపాధిహామీ పనుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఉపాధిహామీ పథకంలో గ్రామాల్లో చెరువుల్లో పూడికతీత, కాలువల నిర్మాణం, కాలువల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు, నూతన మట్టి రోడ్ల నిర్మాణం, నీటి కుంటల తవ్వకం పనులను చేపడుతున్నారు. ప్రతి కూలీకి అధికారులు పని దినాలను కల్పిస్తుండటంతో కూలీలు ఉపాధిహామీ పనులను చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

మండలంలో..

పెంచికల్‌పేట్ మండలంలో 12 గ్రామపంచాయితీలు ఉన్నాయి. ఆయా పంచాయితీల్లో మొత్తం 4,406 జాబ్‌కార్డులు ఉండగా వీటిలో 9265 మంది కూలీలు ఉన్నారు. వీరిలో 3375 జాబ్‌కార్డుల్లో 6825 మంది కూలీలకు అధికారులు 1,18,332 పని దినాలను కల్పించారు. మండలంలో ఉపాధిహామీ పథకంలో పని చేసిన కూలీలకు ఇప్పటి వరకు రూ.2కోట్ల 61లక్షలు చెల్లించారు. ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కూలీ ధరను పెంచడంతో సరాసరి కూలీకి ప్రతీరోజు సుమారు రూ.233 లను చెల్లిస్తున్నారు.

కూలీల ఆసక్తి..

ఖరీఫ్ పనులు నత్తనడకన సాగుతుండటంతో రైతులు, రైతు కూలీలు, మహిళలు ఉపాధిహామీ పనుల వైపు మొగ్గు చూపుతున్నారు. పంట చేలలో ఇంకా పనులు ప్రారంభం కానందున కూలీలు ఉపాధిహామీ పనులకు ఆసక్తి చూపుతున్నారు. దీనికి తోడు గతంలో కంటే భిన్నంగా అధికారులు ప్రతీ జాబ్‌కార్డుకు పనిదినాలను కల్పిస్తుండటంతో కూలీలు పనులకు పరుగులు తీస్తున్నారు. కూలీ నగదు సైతం 15 రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీంతో ఉపాధి పనులను చేయటానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రతీరోజు పని



ఉపాధి హామి పథకంలో ప్రతి రోజు కూలీ దొరుకుతుంది. నీటి కుంటల తవ్వకం, చెరువుల్లో పూడికతీత, కాలువల్లో చెత్త తొలగించే పనులను చేస్తున్నాము. జాబుకార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పిస్తున్నారు. అధికారులు కూలీ నగదు పదిహేను రోజుల్లో ఖాతాల్లో జమ చేస్తున్నారు.

– మానెపల్లి రాజన్న, ఎల్లూర్

ప్రతీ ఒక్కరికి పనిదినాలు కల్పిస్తున్నాం

గ్రామపంచాయతీల్లో జాబ్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి ఉపాధి కల్పిస్తున్నాం. క్షేత్రస్థాయిలో డిమాండ్‌ను బట్టి కూలీలకు పని దినాలు కల్పిస్తున్నాం. ఇప్పటికీ మండలంలో లక్షా18వేల పనిదినాలను కల్పిస్తున్నాం. మరో 15రోజులు కూలీలకు ఉపాధి కల్పించడానికి ఏర్పాట్లు చేశాం. కూలీల నగదు పదిహేను రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం.

– సతీశ్, ఏపీవో, ఎన్‌ఆర్‌ఈజీఎస్, పెంచికల్‌పేట్

మారని 'భగీరథ' తీరు..!



ట్యాంకర్ నీటిని తీసుకెళ్తున్న కొలాంగూడ గ్రామస్తులు

- సరఫరా కాని తాగు నీరు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



ఎడ్ల బండితో నీళ్లు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

వాంకిడి: ఉన్నతాధికారులు గ్రామాలను సందర్శించి తప్పనిసరిగా ఇంటింటికీ నల్లా నీరు సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నా అధికారుల్లో మార్పు రావడం లేదు. రెండు నెలల క్రితం కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్, మిషన్ భగీరథ జిల్లాస్థాయి అధికారులు మండలంలోని ఎనోలి కొలాంగూడ గ్రామాన్ని సందర్శించి ఇంటింటికీ నీరు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు లీకేజీలకు మరమ్మతులు చేయించి నీటి సరఫరా ప్రారంభించారు. దీంతో గ్రామంలోని కొలాం గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. కానీ గత 15 రోజులుగా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడం లేదని 'సాక్షి' దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సమస్య విన్నవించినా రేపు, మాపు అంటు కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. పీఎం జన్‌మన్ యోజన కార్యక్రమంలో భాగంగా పీవీటీజీ గ్రామాలకు రోడ్లు, వైద్య శిబిరాలతో పాటు నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాల్సి ఉండగా అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నీటి సరఫరా లేకపోవడంతో జీపీ ట్యాంకర్ ద్వారా, ఎడ్ల బండ్లపై ఒర్రె నీటిని తెచ్చుకుంటున్నామని వారు చెబుతున్నారు. గ్రామానికి చెందిన ఒక యువకుడు నీటి సరఫరా చేయాలని అధికారులకు పలుమార్లు ఫోన్ చేయగా ప్రతీసారి ఫోన్ చేసి చెడ్డ పేరు ఎందుకు తెచ్చుకుంటావని హితోపదేశం చేసినట్లు ఆ యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఎండుతున్న 'అమ్మన్నమడుగు'



వెలవెలబోతున్న అమ్మన్నమడుగు ప్రాజెక్టు



నీరు లేక బోసిపోయిన ప్రాజెక్టు మత్తడి

- అడుగంటిపోయిన జలం
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

కెరమెరి: మండలంలోని కెస్లాగూడ గ్రామానికి సమీపంలో ఉన్న అమ్మన్నమడుగు ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతోంది. తీవ్రమైన ఎండలకు భూగర్భజలం ఇంకిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం నీటితో కళకళలాగే మత్తడి పూర్తిగా ఎండిపోయింది. ప్రాజెక్టు కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగి అందవిహీనంగా, చెత్తచెదారం చేరి నిరుపయోగంగా మారాయి.

ఆరువేల ఎకరాలకు సాగునీరు..

ఆరువేల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలనే లక్ష్యంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం 2001లో మండలంలోని కేస్లాగూడ వాగుపై రూ.16 కోట్ల నిధులతో అమ్మన్నమడుగు ప్రాజెక్టు నిర్మించింది. అందులో రూ.10 కోట్లు ప్రాజెక్టు నిర్మాణానికి కాగా, రూ. 6 కోట్లు కాలువల నిర్మాణ పనులకు ఖర్చు చేశారు. ప్రాజెక్టు నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏటా ప్రాజెక్టు నీరు నిండి కళకళలాడేది. కానీ ఈ సారి ఎండల తీవ్రత అధికం కావడంతో నీరు లేక బోసిపోయింది. మళ్లీ భారీ వర్షాలు కురిస్తేనే ప్రాజెక్టు మళ్లీ నీటితో కళకళలాడుతుంది.

ప్రమాదంలో కట్ట

గతేడాది భారీ నీటి ప్రవాహానికి చెరువు కట్ట తెగిపోవడంతో ప్రాజెక్టు కింద ఉన్న కెస్లాగూడ గ్రామ ప్రజలను ఉన్నతాధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అప్పట్లో తాత్కాలిక పనులు చేపట్టిన అధికారులు తర్వాత దాని బాగోగులు మరిచారు. మళ్లీ భారీ వర్షం కురిస్తే గ్రామం కొట్టుకు పోవడం ఖాయమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రారంభానికి మోక్షమెప్పుడో..?

- 2022లో కేజీబీవీ భవన నిర్మాణం పూర్తి
- ఇప్పటికీ ప్రారంభం కాని వైనం
- తాత్కాలిక భవనంలో విద్యార్థుల ఇక్కట్లు



లింగాపూర్‌లో నిర్మించిన కేజీబీవీ భవనం

లింగాపూర్: మండల కేంద్రం నుంచి పిట్టగూడ వెళ్లే దారిలో 2022లో నిర్మించిన కస్తూరిబా గాంధీ విద్యాలయ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం పాఠశాలను తాత్కాలికంగా ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. అలాగే వసతిగృహాన్ని పక్కనే ఉన్న ఎమ్మార్సీ భవనంలో అరకొర వసతుల మధ్య కొనసాగిస్తున్నారు.

అరకొర వసతుల మధ్య..

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల భవనంలో కేజీబీవీ కొనసాగుతోంది. ఇక్కడ మౌలిక వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పదో తరగతి పరీక్షల్లో ఏటా 100 శాతం ఫలితాలు సాధిస్తున్నా వసతులు మాత్రం కల్పించడం లేదు. ప్రస్తుతం పాఠశాలలో 160 మందికి పైగా విద్యార్థినులు, 18 మంది వరకు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారు. వారు భోజనాలు చేసేందుకు డార్మెంటరీ గది లేకపోవడంతో వరండాలోనే భోజనాలు చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్రూంలు లేకపోవడంతో పాటు విద్యార్థినులు ఆటలు ఆడేందుకు సరైనా స్థలం కూడా లేదు. పాఠశాల సమీపంలో మురుగు నీటి నిల్వ, చెట్ల పొదలు ఉండడంతో విద్యార్థినులు రోగాల బారిన పడుతున్నారు.

2022లో ప్రారంభం..

సమగ్ర శిక్ష కార్యక్రమం కింద పాఠశాల, వసతి గృహం నిర్మాణ పనులను 2022లో స్థానిక ప్రజాప్రతినిధులు చేపట్టారు. ఇందుకు రూ.3.35 కోట్లు వ్యయం చేశారు. భవనం నిర్మాణ పనులు పూర్తికాగా రంగులతో ముస్తాబు చేశారు. కానీ పాఠశాల భవనాన్ని ఇప్పటికీ ప్రారంభించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని, పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే ఇంటర్ కూడా పూర్తి చేసే విధంగా పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని మండలవాసులు కోరుతున్నారు. జిల్లాలోని వివిధ కేజీబీవీల్లో ఇప్పటికే ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారు. మండలంలో జూనియర్ కళాశాల లేకపోవడంతో అమ్మాయిలు పదవ తరగతి పూర్తయ్యాక దూర ప్రాంతాలకు వెళ్లలేక చదువును ఆపేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి కేజీబీవీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని, ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని బాలభారతి ఉన్నత పాఠశాల 1994–95 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని రాయల్ గార్డెన్‌లో నిర్వహించిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. 29 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎమ్మాజీ సతీశ్, బుక్క బాలు, సదానందం, అనిల్, ప్రతాప్, పోతురాజుల రమేశ్, ఖలీల్, అశ్వక్, కిరణ్, నాగరాజు, సరిత, సుజాత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జవాన్‌కు ఘన స్వాగతం

నార్నూర్: హైదరాబాద్‌లోని ఆర్మీ ట్రైనింగ్ సెంటర్‌లో ఏడు నెలలు శిక్షణ పూర్తి చేసుకొని ఆదివారం స్వగ్రామానికి చేరుకున్న ఆర్మీ జవాన్ తోర్కడ్ రాజ్‌కుమార్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామ పెద్దలు మెస్రం శేఖర్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలోని ఒక మారుమూల గ్రామం నుంచి కష్టపడి ఆర్మీ ఉద్యోగానికి ఎంపికైన రాజ్‌కుమార్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

నిత్యాన్నదానం పునః ప్రారంభం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో నిత్యాన్నదాన కార్యక్రమం తిరిగి ప్రారంభమైంది. కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి గత కొన్ని రోజులుగా తన క్యాంపు కార్యాలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా తాత్కాలికంగా నిలిపివేశారు. ఇటీవల కోడ్ ముగియడంతో ఆదివారం తిరిగి పున ప్రారంభించారు. పలువురు పేదలకు ఆయన స్వయంగా భోజనాన్ని వడ్డించారు. సోమవారం నుంచి ఎప్పటిలాగే యధావిధిగా ఉచిత నిత్యాన్నదానం కొనసాగనుందన్నారు.

అమ్మవారి సన్నిధిలో భక్తుల పూజలు



భోజనం వడ్డిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల ప్రసిద్ధ కనకదుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ గ్రామాల నుంచి అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. అమ్మవార్లకు ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. కోరుకున్న కోరికలు తీరాలని అమ్మవారికి ముడుపులు కట్టారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ ఆవరణలో ఉన్న మహంకాళి విగ్రహంతో పాటు శనేశ్వరుడు, కాళభైరవుడిని దర్శించుకొని పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ భక్తులకు అన్నదానం చేశారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



జన్కాపూర్ రామాలయం వద్ద టపాసులు పేలుస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: భారత ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం రాత్రి బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. జన్కాపూర్ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆలయం ముందు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. నాయకులు చంద్రకాంత్, తిరుపతి, శ్రావణ్ గౌడ్, రవి, నవీన్, శివచందు, సాయి కుమార్, వంశీ, సురేశ్, గణేశ్ నాయక్ పాల్గొన్నారు.

బీటీ వేయండి సారూ..!



కెరమెరి: ఏళ్ల చరిత్ర కలిగిన గ్రామం చాలబాడికి నేటికీ సరైన రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. పాటాగూడ తర్వాత కిలోమీటరు వరకు తారురోడ్డు వేసిన అధికారులు మరో 2 కిలోమీటర్లు బీటీ వేయడం మరిచారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.

ఆర్ఎంపీల రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహార దీక్షలో ఆర్ఎంపీ, పీఎంపీలు

బెజ్జూర్: ఆర్ఎంపీ, పీ ఎం పీలు ఆదివారం మండల కేంద్రంలో రిలే నిరా హార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఇబ్రాహీం, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్‌లు మాట్లాడు తూ ఆర్ఎంపీ, పీఎంపీలపై ప్ర భుత్వ అధికారుల తనిఖీలు, దా డులకు నిరసనగా నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వెంటనే దాడులను నిలిపివేయాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా బెజ్జూర్, కౌటాల, చింతలమానెపల్లి, దహెగాం, సిర్పూర్ మండలాల అధ్యక్షులు ఆర్ఎంపీలకు సంఘీభావం తెలిపారు.